

మంగమూరు రోడ్డు జంక్షన్‌లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డివైడర్‌పై నాటిన మొక్కలను కూటమి ప్రభుత్వం వచ్చాక పీకివేయడంతో బోసిగా ఉన్న డివైడర్

పాలకుల పాపం.. పచ్చదనానికి శాపం..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంగోలు నగరంలో పచ్చదనంపై పర్యవేక్షణ కరువైంది. స్థానిక ఎమ్మెల్యే, నగరపాలక సంస్థ ప్రజాప్రతినిధులు,అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా నగరంలో ఎక్కడ చూసినా ఎండిన మొక్కలు, చెట్లు మినహా పచ్చదనం కనిపించడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నగరంలోని మామిడి పాలెం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు కట్ట చుట్టూ చెట్లు, మొక్కలు నాటారు. పచ్చదనం పెంచి వాకర్లకు ఆహ్లాదకరమైన వాతావ రణం కల్పించారు. ప్రస్తుతం ఒడా – నగరపాలక సంస్థ మధ్య సమన్వయ లోపంతో ఆ మొక్కలు, చెట్లన్నీ ఎండిపోయి కళావిహీనంగా కనిపిస్తున్నాయి. కోట్ల రూపాయల ప్రజాధనం నిరుపయోగమైంది. అదేవిధంగా నగరంలోని డివైడర్లపై నాటిన మొక్కలు సైతం పర్యవేక్షణా లోపం కారణంగా కొన్ని వాడిపోయి మరికొన్ని ఎండిపోయి చావుకు చేరువయ్యాయి. అయినప్పటికీ నగరపాలక సంస్థ పాలకులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఎమ్మెల్యే దామచర్ల సైతం ఒంగోలు నగరంలో పచ్చదనాన్ని గాలికొదిలేయడంపై ప్రజలు విమర్శిస్తున్నారు.

– సాక్షి, ఒంగోలు




నగరంలోని డివైడర్లలో ఇటీవల నాటగా పర్యవేక్షణ లేక ఎండిన మొక్కలు






డివైడర్ల మధ్యలో నాటేందుకు తెచ్చిన మొక్కలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఎండిపోయిన దృశ్యాలు



పాత జాతీయ రహదారిపై సుజాతనగర్ వద్ద నుంచి మంగమూరు రోడ్డు వరకు డివైడర్‌పై నాటిన మొక్కలు ఎండిపోవడంతో మిగిలి ఉన్న మోడు



డివైడర్‌పై నరికివేతకు గురైన చెట్టు







మామిడిపాలెం ఎస్ఎస్ ట్యాంకు కట్టపై గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటిన కొబ్బరి చెట్లను ప్రస్తుతం పట్టించుకోకపోవడంతో ఎండిపోయిన దృశ్యాలు

క్లుప్తంగా

సత్యసాయి మందిరంలో రక్తదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువత

ఒంగోలు మెట్రో: సత్యసాయిబాబా శత జన్మది నోత్సవంలో భాగంగా ప్రతి నెలా ప్రత్యేక కార్య క్రమాల సందర్భంగా ఆదివారం ఒంగోలు మంగమూరుడొంక జెడ్పీకాలనీలోని భగవాన్ సత్యసాయిబాబా మందిరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మందిర కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిం చగా, పదిమంది యువత పాల్గొని రక్తదానం చేశారు. కోడెల శ్రీనివాసరావు, పద్మావతి దం పతులతో పాటు రాజేశ్వరి, సంధ్య, రేణుక, పేర్ని సాయికృష్ణ, సాయికుమార్, యశ్వంత్ సాయి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం



మరుత్ కుమార్‌ను సన్మానిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సభ్యులు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, చిలకపాడు హైస్కూల్ ఉపాధ్యాయుడు పరాం కుశం మరుత్ కుమార్ ఆత్రేయను ఆదివారం గుంటూరులో అపనకన ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు పురుషోత్తంశర్మ, వెంకట సుబ్బారావు, అంజిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

18న చీమకుర్తి మండల పరిషత్ సమావేశం

చీమకుర్తి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన మం డల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో రాఘవేంద్ర ఒక ప్రకట నలో తెలిపారు. మండల స్థాయి అధికారులు వారి దగ్గరున్న ప్రగతి నివేదికలతో రావాలని, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

గ్రామం కోసం ఫౌండేషన్ స్థాపన అభినందనీయం

- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి

మద్దిపాడు: విదేశాలలో ఉద్యోగం చేస్తూ పుట్టిన ఊరికి ఏదో ఒక మేలు చేయాలన్న తలంపుతో ఫౌండేషన్ స్థాపిం చడం, తద్వారా గ్రామాభివృద్ధి చేయాలన్న ఆలోచన చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో ఇనమన ఫౌండేషన్ ప్రారంభ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పుట్టిన గ్రామాన్ని వదిలివెళ్లిపోతున్న ఈ రోజుల్లో తన గ్రామం కోసం ఏదో ఒకటి చేయాలన్న ఆలోచన రావడమే గొప్ప విషయమని బత్తుల అన్నారు. ఇనమనమెళ్లూరు గ్రామా నికి చెందిన ఎన్ఆర్ఐ యెనుముల సుధాకర్‌రెడ్డి గ్రామం లో ఏర్పాటు చేస్తున్న ఈ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్ర మాలు, అభివృద్ధి కార్యక్రమాలు విస్తరించనున్నారని తెలి పారు. ముందుగా గ్రామంలో తాగునీటి సమస్యపై వారు దృష్టి సారించడంపై గ్రామస్తులు అభినందనలు తెలియ జేశారన్నారు. విద్య, వైద్యం ప్రతి కుటుంబానికి అవసర మని, ఆ రెండింటినీ గ్రామస్తులకు అందిస్తే గ్రామం అభి వృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఫౌండేషన్ ఏర్పాటు సందర్భంగా మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు



ఇనమన ఫౌండేషన్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పక్కన ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, నాయకులు

చేయడం కూడా అభినందనీయమని అన్నారు. సాధార ణంగా ఫౌండేషన్ ఏర్పాటు చేసేవారు తమ ఇంటి పేరు, తమ వారి పేర్లపై ఏర్పాటు చేస్తారని, కానీ, గ్రామం పేరుతో ఏర్పాటు చేసిన ఏకైక ఫౌండేషన్ ఇనమన ఫౌండే షన్ అని బత్తుల అభినందించారు. కుల, మత రాజకీయా లతో సంబంధం లేకుండా గ్రామాభివృద్ధే ధ్యేయంగా గ్రామంలోని నాయకులు సంస్థకు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. అనంతరం ఉపాస్ ఆస్పత్రి వారితో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను యెను ముల వెంకట్రామిరెడ్డి సతీమణి అంజమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండే షన్ చైర్మన్ రామిరెడ్డి, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, గ్రామ సర్పంచ్ ఏకుల ఏడుకొండలు, ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, మాజీ సర్పంచ్ వాకా గంగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మందపల్లి శ్రీనివాసరావు, కొండూరు ప్రభాకర్‌రెడ్డి, దొప్పా శేషయ్య, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మంచంపట్టిన పెద్దవరం

- చోద్యం చూస్తున్న వైద్యారోగ్యశాఖ

కురిచేడు: ఒకవైపు మండుతున్న ఎండలు.. మరోవైపు అడపాదడపా కురుస్తున్న వర్షాలకు వాతావరణ మార్పుల ప్రభావంతో ప్రజలు అనారోగ్యం బారిన పడి మంచంపడుతున్నారు. కురిచేడు మండలంలోని పెద్దవరం గ్రామంలో ప్రతి ఇంటికి ఇద్దరుముగ్గురు మంచంపట్టారు. మండలంలో ఒకే ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా, వైద్యసిబ్బంది పట్టించుకో కుండా చోద్యం చూస్తుండటంతో ప్రజలు వ్యాధులతో అవస్థపడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి సచివాలయానికి ఒక సీనియర్ నర్సు ఉండటం తో పాటు ప్రతి సీజనులో ఇంటింటికి వలంటీర్లతో సర్వే చేయించి జ్వరపీడితులను గుర్తించి వైద్యశిబి రాలు ఏర్పాటు చేసి సేవలందించే వారు. కానీ, కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 17 నెలలైనా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దీంతో ప్రజలు ఆర్ఎంపీల వద్ద వైద్యం చేయించుకుంటూ డబ్బులు ఖర్చుచేసుకుం టున్నారు. జ్వరం ఎక్కువగా ఉన్న వారు వినుకొండ, నరసరావుపేట, గుంటూరు, దర్శి తదితర ప్రాంతా లకు వెళ్లి వేలకు వేలు ఖర్చుచేసుకుని వైద్యం చేయిం చుకుంటున్నారు. పేదలు మాత్రం ఖర్చుకు భయపడి స్థానికంగా ఆర్ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ వైద్యులు ఆస్పత్రికే పరిమితమై వైద్య శిబి రాలు ఏర్పాటు చేయకపోవటం, క్షేత్రస్థాయిలోని సిబ్బంది కూడా సరైన సమాచారం ఉన్నతాధికారు లకు అందించకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు స్పందించి పెద్దవరం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వరాలు అదుపులోకి వచ్చేంత వరకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

దర్శిలో విజృంభిస్తున్న విషజ్వరాలు

దర్శి: పట్టణంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి.



దర్శి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

సీహెచ్‌సీకి వచ్చిపోయే రోగులకు ఎడతెరిపి లేకుం డా పోయింది. వార్డులో ఏ మంచంలో చూసినా పేషెంట్లే దర్శనమిస్తున్నారు. వారికి వసతులు మాత్రం కరువయ్యాయి. ఆస్పత్రిలో ఒక పూట పెడితే మరో పూట భోజనం పెట్టకుండా ఎగ్గొడు తుండటంతో రోగులు బయటకు వెళ్లి ఆహారం తెచ్చుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవాలంటే తలకు మించిన భారం పడుతోందని ప్రభుత్వాస్ప త్రులకు వస్తే ఇక్కడ పట్టించుకునే వారే కరువవుతు న్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. వచ్చిన వారిని నర్సులే చూసి పంపుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం రోగులకు భోజనం అందించారేగానీ.. సాయంత్రం మాత్రం భోజనం ఇవ్వలేదు. దీంతో రోగులు బయటకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వంలో ప్రభు త్వాస్పత్రుల పరిస్థితి దయనీయంగా తయారైందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు సాయంత్రం అన్నం ఎందుకు పెట్టరని విలేకరుల ఎదుటే నర్సులను రోగుల బంధువులు నిలదీ యడం గమనార్హం. దీంతో వార్డులోకి వెళ్లి అడగ్గా పేషెంట్లందరూ తమకు సాయంత్రం ఆహారం ఇవ్వలేదని తెలిపారు.

శిక్షణ తరగతులకు విశేష స్పందన



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న చిన్నారులు

ఒంగోలు మెట్రో: శ్రీగిరి బాలవిహార్ శిక్షణ తరగతులకు చిన్నారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం రాగానే పిల్లలంతా ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని శ్రీగిరి గోక్షేత్ర భవనంలో నిర్వ హిస్తున్న బాలవిహార్ శిక్షణ తరతులకు హాజరవుతున్నారు. శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో భారతీయ సంస్కృ తి, సనాతన ధర్మం, నైతిక విలువలు, వేదాలు, ఉపనిషత్తులు, రామాయణ భారత భాగవతాలు, భగవద్గీత శ్లోకాలు వంటి వాటిపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. పిల్లలను వ్యక్తిత్వ వికాసం కలిగిన వారిగా తీర్చిదిద్ది వారి భవితకు బంగారు బాటలు వేయాలనే లక్ష్యంతో 5 వారాలుగా నిర్వహిస్తున్న శిక్షణ తర గతులు సత్ఫలితాలిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు.

వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు

చీమకుర్తి రూరల్: మండలంలోని ఏలూరివారిపాలెం గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు పూర్తి చేశారు. ఆర్‌డ బ్ల్యూఎస్ ఏఈ శాంతిప్రియ పర్యవేక్షణలో సర్పంచ్ ఏలూరి శ్రీలక్ష్మి సురేష్ ఆధ్వ ర్యంలో పంచాయతీ నిధులతో వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి గ్రామస్తులకు మంచినీరు సరఫరా చేశారు.

పోలేరమ్మా దీవించమ్మా..

కొనకనమిట్ల: మహాలయ పక్షాన్ని పురస్కరించుకొని మండలంలోని గొట్లగట్టు గ్రామంతోపాటు హరిజన కాలనీ వాసులు ఆదివారం సాయం త్రం గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వ హించి అమ్మవారిని దర్శించుకున్నారు. హరిజన కాలనీ వాసులు కుంకుమ బండ్లతో ఉత్సవం నిర్వహించారు. మహిళలు బోనాలతో వెళ్లి అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించారు.